# భూ
# భ వ

## పోడూరి కృష్ణకుమారి

తాజావార్త: రోబోటిక్ రోవర్ "క్యూరియాసిటీ" మార్స్ గ్రహం మీద లేండ్ అయింది. సునీతావిలియమ్స్ అంతరిక్షపు ఆంతర్యాల పరిశోధనకై తిరిగి రెండవసారి రోదసిలోకెగిసింది. కనపడుతూ అందకుండా ఊరించే అంతరిక్షం దాచుకున్న రహస్యాలను మానవుడు అర్థం చేసుకునే ప్రయత్నంలో యూరీ గగారిన్ చేసిన మొదటి రాకెట్ యాత్రతో ప్రారంభమైన జైత్రయాత్ర నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రుడిపై మొదటి అడుగు వేయించింది. వాలంటీనాటెరిష్కోవా అంతరిక్షానికి పయనించిన ప్రథమమహిళ. అంతుపట్టని అంతరిక్ష ఆకర్షణలో మనిషి కొత్తప్రయోగాలతో రోదసియాత్రలను చేస్తూనే ఉంటాడు. ఇంకా ముందు ముందు ఎలాఉంటుంది? ఏంజరుగుతుంది? రండి ఒక్కసారి ఊహిద్దాం మనమూ రాకెట్‌ని అధిరోహిద్దాం. నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, కల్పనా చావ్లాలకు నివాళులర్పిస్తూ రోదసిలో అడుగిడదాం.

స్వాతి సపరివార పత్రిక నవలల పోటీలో బహుమతి పొందిన నవల

పోడూరి ప్రచురణలు
హైద్రాబాదు

# భూభవ

నవల

పోడూరి కృష్ణకుమారి

పోడూరి ప్రచురణలు
హైదరాబాద్

# ***BhooBhava***

By **Poduri Krishnakumari**

© Poduri Krishnakumari

*First Edition* : 2012

*Price* : Rs.**120/-**

*For Copies* :

**Poduri Krishnakumari**
Flat No. 501, Highlight Haveli
St.No. 6, Hubsiguda
Hyderabad - 500 007
e.mail:podurikrishnakumari@gmail.com
&
**All leading Bookshops**

*Book Production* :
Pustak Shilpi
**T. Muralidhar Gowd**
9393 176 552

*Cover design* :
..

*DTP:*
**K.B.T. Kondaiah**

*Published by* :
**Poduri Prachuranalu**
Hyderabad - 500 007
Cell : 944 1226 880

*Printed at :*
**Karshak Art Printers**
(*Multicolour Printers & Designers*)
40-APHB, Vidyanagar, Hyderabad - 500 044
Ph : 040-2761 8261

# ముందుమాట

**రో**దసీ పరిశోధనలపై తెలుగులో వచ్చిన మొదటి నవల.

ఆధునిక తెలుగు సాహిత్యంలో మొదటినుంచీ నవలకు ఓ ప్రత్యేకత ఉంది. తెలుగు పాఠకలోకాన్ని పెంచిన సాహితీ ప్రక్రియకూడా నవలే. వీరేశలింగంగారి రాజశేఖర చరిత్రతో ప్రారంభమైన తెలుగు నవల నేటి వరకూ మూడు పువ్వులూ ఆరు కాయలుగా అలరారుతోంది.

తెలుగులో వచ్చిన నవలలు ఎన్నోరకాలుగా పేర్కొనవచ్చును. సాంఘిక నవలలు, రాజకీయ నవలలు, నేరపరిశోధక నవలలు, హాస్యనవలలు, అంతరిక్ష పరిశోధనాత్మక నవలలు- ఇలా ఎన్నోరకాలు. పుర్రికోబుద్ధి జిహ్వకో రుచి అన్నారు పెద్దలు. అందుకే ఇన్నిరకాల వస్తువులతో ఎన్నోరకాల నవలలు.

మన రచయిత్రి శ్రీమతి పోడూరి కృష్ణకుమారి ఇప్పటికే నవలారచయిత్రిగా 'చతుర' మాసపత్రికలో "రాలినమొగ్గలు", 'ఆంధ్రభూమి మాసపత్రిక'లో "కనబడుటలేదు", "నాగార్జున నైటింగేల్" అనే నవలలు రచించి పాఠకుల అభిమానాన్ని అందుకున్నారు. ఇప్పుడు స్వాతి వారపత్రికలో ప్రచురించబడిన "భూభవ" అనే అంతరిక్ష పరిశోధనాత్మక నవల రచించి పాఠకలోకాన్ని ఆశ్చర్యంలో, ఆనందంలో ముంచెత్తి సంచలనం కలిగించారు.

రోదసినౌకల ప్రయాణంపై పరిశోధనచేసి, రాబోయే శతాబ్దులలో అంతరిక్ష పరిశోధనలను ఊహించి రచించిన ప్రయోగాత్మక నవల ఇది. పైగా రచయిత్రి ఈ నవలలో కథాకాలాన్ని చెప్పకుండా పాఠకలోకానికే వదిలేసారు.

ఈ నవలాకాలం నాటికి ప్రపంచమంతా ఒకదేశంగా కలిసిపోయి గ్లోబల్ ప్రభుత్వం ఏర్పాటు చేసుకున్నట్లు రచయిత్రి పేర్కొన్నారు. మానవులు దేశాలపేరుతో నీటికొరకు, నేలకొరకు, ఆకాశంలో భాగం కొరకు పోరాటాలు చేసుకుంటూ నవలాకాలానికి గ్లోబల్ ప్రభుత్వం ఏర్పరచుకొని శాంతియుత జీవనం సాధించారని రచయిత్రి పేర్కొన్నారు. ఈనాటి దేశకాల పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రచయిత్రి రాబోయే కాలంలో ఈ పరిణామం రావాలని రచయిత్రి ఊహించి చెప్పినట్టు కనబడుతోంది.

ఈ నవలలో రచయిత్రి కథను నడిపించిన తీరు మనకు ఆశ్చర్యాన్ని కలిగించక మానదు. అది కేవలం ఆమె ఊహ కాదు. పత్రికలు, కొన్ని జర్నల్సూ, ఇంటర్నెట్‌లోని వివిధ అంశాలు పరిశీలించి పరిశోధించి ఏర్చి కూర్చి రచించిన కథాంశం. ఈమె విజ్ఞాన శాస్త్రవేత్త కాదు. కానీ ఈ అంశంపై పరిశోధన సలిపి తన అభిప్రాయాలతో ఈ నవలను నడిపిన తీరు వినోదాన్నే కాదు విజ్ఞానాన్ని కూడా అందిస్తుంది.

ఈ నవల చదువుతుంటే మనం అందులో లీనమై మనంకూడా అంతరిక్షానికెగసి అంతరిక్ష పరిశోధనలలో నిమగ్నమైన అనుభూతి కలుగుతుంది.

ఈ కథాంశం ప్రకారం ఈనాడు మనం భారతదేశంగా చెప్పుకుంటున్న భారత భూభాగంలో 'నాస్క్' అనే సంస్థ డైరెక్టర్ బృహస్పతి భూతభవిష్యత్ వర్తమాన కాలాలకు ఒకే సమయంలో వ్యోమనౌకలు పంపి పరిశోధనలు చేసేందుకై శాస్త్రజ్ఞులను ఎన్నుకుంటాడు. ఆ మూడు వ్యోమనౌకలు బయలుదేరడం, అవి కొన్ని శాస్త్ర పరిశోధనలు అంతరిక్షంలోను, కొన్ని గ్రహాలమీద ఆయా పరిశోధనలకు కలిగిన అనేకానేక ఉత్కంఠభరితమైన అనుభవాల రూపమే ఈ నవలలోని వస్తువు.

ఇది ఓ కుటుంబ కథాకథనం కాదు. అందరినీ ఆకట్టుకునే ప్రేమ కథాకథనమూ కాదు. ఈనాటి వరకూ జరుగుతున్న అంతరిక్ష పరిశోధనలతో రాకెట్ ప్రయోగాలతో కలిగిన ప్రయోజనాలతో కూడిన కథాంశంతో కూడిన ఆసక్తిదాయకమైన నవల ఇది.

ఈ నవలలో ముఖ్యంగా రోదసియాన శిక్షణలు, సేపేస్ షటిల్ నిర్మాణ విశేషాలు, ఆధునిక వైజ్ఞానికులు కనిపెట్టిన శాస్త్రవిజ్ఞానాలు అనేక శతాబ్దులకు ముందే మన శాస్త్రజ్ఞులు కనుగొని మరుగునపడిన కొన్ని ముఖ్య విషయాలు మనని ఆశ్చర్య చకితులను చేస్తాయి. ఈ నవలలో అరుదైన విషయాలు గోచరిస్తాయి.

7వ శతాబ్దంలోని బ్రహ్మగుప్తుడు అనే శాస్త్రజ్ఞుడు భూమిచుట్టు కొలతను 5,000 యోజనాలుగా పేర్కొనగలిగిన విషయం మనకు విశదమౌతుంది. అనగా నేటి కొలమానం ప్రకారం 36,000 కిలోమీటర్లన్నమాట. ఇది ఆధునిక శాస్త్రజ్ఞులు అత్యాధునిక పరికరాలతో గుణించగలిగిన 40,000 కిలోమీటర్లకు అతి దగ్గరగా ఉండటం. ఇది ఆధునిక శాస్త్రజ్ఞులు నిజంగా ఆశ్చర్యమే కదా అంతేకాదు బ్రహ్మగుప్తునికంటే వంద సంవత్సరాలముందు వరాహమిహిరుడు భూమికి గురుత్వాకర్షణశక్తి ఉందని చెప్పడం యథార్థమే కదా!

వీరందరూ న్యూటన్ కన్నా చాలాముందు కాలం వారని అందరికీ తెలిసిన విషయమే కదా! ఇది ఆధునిక శాస్త్రజ్ఞులు, ఇది ఆధునిక శాస్త్రజ్ఞులు, ఇది ఆధునిక శ్యాస్త్రజ్ఞులు న్యూటన్ 13వ శతాబ్దం వాడే కదా! ఆర్యభట్ట, బ్రహ్మగుప్తుడు ఆరు, ఏడు శతాబ్దాలకు చెందినవారని చరిత్ర స్పష్టం చేసిందే కదా!

అదే విధంగా ఇబ్న్ అల్ నఫీస్ అనే అరబ్ జాతీయుడు రక్తప్రసరణ గురించి 13వ శతాబ్దంలోనే మనకు తెలియచేసాడని సమాచారం ఉంది. విలియమ్ హార్వే 1616లో రక్తప్రసరణ గురించి కనుగొన్నాడని పిల్లల పాఠ్యపుస్తకాల్లో నేటికీ చాటుతూనే ఉన్నాం. మరుగున పడిన యథార్థాలు ఇకనైనా వెలుగులోకి రావాలి కదా!

మన పురాణాలు పుక్కిటి పురాణాలుగా కొందరు భావిస్తున్నా అనేక గొప్ప విషయాలు అందులో చోటుచేసుకున్నాయనడం యథార్థం. ఈ యథార్థాన్ని అందరూ గ్రహించాలి. మన పురాణాలలోని కొన్ని శాస్త్రసమ్మతమైన విషయాలను ఈ రచయిత్రి ప్రస్తావించడం విశేషం. కకుద్మి కథలో బ్రహలోకానికీ భూలోకానికి కాలమానంలో యుగాల తేడా ఉన్నట్టు చెప్పారు. భూమిమీద కాలప్రమాణానికీ అంతరిక్షంలోని కాల ప్రమాణానికీ తేడా ఉన్నట్టుగా ఆనాడే గుర్తించగలిగారు. అదేవిధంగా యయాతి కథలో మానసిక విశ్లేషణకు సంబంధించిన విషయ ప్రస్తావన కనబడుతుంది.

అంతరిక్షంలో సంచరించే వారిని యక్ష, కిన్నెర, గంధర్వులుగా భారతీయ పురాణాలలో అతిసుందరంగా ఊహించి వర్ణించగలిగారు. పాశ్చాత్యుల దృష్టిలో గ్రహాంతర వాసులు కాస్త విచిత్రమైన రూపు కలిగిన మొరటువారే కదా! ఈ విధంగా ఈ నవలలో పురాణాలలోని విజ్ఞానశాస్త్ర విషయాలను ప్రస్తావించడం రచయిత్రి విజ్ఞాన దృష్టికి నిదర్శనం. అదేవిధంగా ఇతర శాస్త్ర విషయాలను కూడా రచయిత్రి ప్రస్తావించి రచనా వైదుష్యాన్ని తెలియచేసారు.

ఇటువంటి విజ్ఞానశాస్త్ర పరిశోధనలో కూడా అంతరిక్షయానాన్ని గురించి ప్రస్తావించిన నవల రాలేదని నేను భావిస్తున్నాను. రచయిత్రి అంతరిక్షయాన విజ్ఞానదృష్టికి సంతోషమే కాదు ఆశ్చర్యము కలుగుతోంది. రచయిత్రుల నవలలు సాధారణంగా వంటింటికే పరిమితం అన్న మాట వమ్ము చేస్తూ ఆకాశమంత విజ్ఞానదృష్టితో రచించిన ఉత్తమ నవలగా నేను భావిస్తున్నాను.

పండితులు, శాస్త్రజ్ఞులు, సాహితీవేత్తలు, సాహితీప్రియులు చదువలసిన నవల ఇది. ఇటువంటి నవలను రచించిన పోడూరి కృష్ణకుమారి ధన్యులు.

***శ్రీమతి డా॥ వాసాప్రభావతి***

# నా మాట

స్వాతి సపరివార పత్రిక నవలలపోటీకై నేను వ్రాసిన 'భూభవ' నవల బహుమతి పొందడం నాకెంతో ఆనందాన్ని కలిగించింది. పాఠకులనుంచి ఎంతో మంచి స్పందన వచ్చింది. ఎందరో సహృదయులైన పాఠకులు ఫోన్ కాల్స్ ద్వారా అభినందించారు. వారందరికీ కృతజ్ఞతలు.

లేఖిని మహిళాచైతన్య సాహిత్య సాంస్కృతిక సంస్థ స్థాపకురాలు ప్రముఖ కవయిత్రి డా॥ వాసాప్రభావతిగారు అడిగిన వెంటనే తమ అమూల్యమౌన కాలాన్ని వెచ్చించి ముందుమాట వ్రాసి ఇచ్చారు. డా॥ వాసాప్రభావతిగారు వనితామహా విద్యాలయంలో తెలుగు రీడర్‌గా ఉద్యోగవిరమణ చేసారు. తెలుగు యూనివర్సిటీ వారి ఉత్తమ రచయిత్రి అవార్డు, రచయిత్రి ఉత్తమ గ్రంథపురస్కారం, గృహలక్ష్మి, స్వర్ణకంకణం మొదలుగాగల ఎన్నో అవార్డులను పొందినవారు. అడగ్గానే వారు నా నవలకు ముందుమాట వ్రాసి ఇవ్వడం నాకు చాలా ఆనందాన్ని కలిగించింది.

నా రచనావ్యాసంగాన్ని ప్రోత్సహించే శ్రీవారు డా॥ గోపాలశర్మగారు (సైకియాట్రిస్ట్)కి నా మనఃపూర్వక కృతజ్ఞతలు. ఈ నవలకు కాన్సెప్ట్ నిచ్చిన మా చిన్నబ్బాయి డా॥చేతన్ దత్తాకు దీవెనలు. తమ చిలిపి అల్లరితో మమ్మల్ని మురిపించే మా మనవలు ప్రద్యుమ్నదత్తా, జ్యోతిరాదిత్య దత్తాలకు ఆశీస్సులు. మాకు అన్నిటా బాసట నిలిచే మా అభిమాన పుత్రుడు తమిరిశ నీలాద్రి, అతని ధర్మపత్ని రుక్మిణిలకు దీవెనలు.

ఈ నవలలో ప్రస్తావించిన వైజ్ఞానిక విశేషాలు న్యూస్ పేపర్ ఆర్టికల్స్, ఇతర జర్నల్స్, ఇంటర్నెట్ వంటి వాటి నుంచి సేకరించినవి. ఎక్కడైనా చిన్న పొరబాట్లు దొర్లి ఉంటే క్షంతవ్యురాలిని.

ఇప్పటికే ఋజువైన వైజ్ఞానిక విశేషాలనాధారం చేసుకుని రచయిత తన ఊహకు రెక్కలు విప్పి హద్దుల్లేని ఆకాశంలో విహరింపజేసి సృష్టించేదే ఆధునిక సైన్స్ ఫిక్షన్ సాహిత్యం. మన భారతీయ పురాణాలు చదువుతుంటే అవి కూడా సైన్స్ ఫిక్షన్ కథలేననిపిస్తుంది. ఆనాటికే కొందరు మేధావులు కొన్ని తిరుగులేని వైజ్ఞానిక విశేషాలను అప్పటికే కనిపెట్టి విద్యావంతులకు అందించడం జరిగిందేమో! వాటి నాధారం చేసుకుని సామాన్యునికి అందించి కొంత సామాజిక పౌతిక సంస్కరణ కూడా జోడించే దృక్పథంతో అప్పటి

సాహితీకారులు ఈ పురాణాలను వ్రాసారేమో అనిపిస్తుంది. ఇదే విషయాన్ని కొంత సూచనప్రాయంగా అందించడానికి కూడా ప్రయత్నించాను ఈ నవలలో. పాఠకులు కూడా ఏకీభవిస్తారని ఆశిస్తాను.

ఎప్పటికీ చిరంజీవి అయిన మా పెద్దబ్బాయి హేమంత్ దత్తా మధుర స్మృతికి ఈ నవల కూడా అంకితం.

**పోడూరి కృష్ణకుమారి**

# భూ భవ

## నాంది

**ఈ** కథ జరుగుతున్న కాలానికి... ప్రపంచంలో ఉన్న దేశాలన్నీ సమానమయిన ఆర్థిక, సామాజిక, వైజ్ఞానిక అభివృద్ధిని సాధించాయి. ప్రపంచదేశాలన్నీ సమైక్యమైపోయి, ఒకే ఒక గ్లోబల్ దేశంగా కలిసిపోయాయి. అర్థమైందనుకుంటా, ఇది భవిష్యత్తులో జరగబోయే కథ. రానున్న తరాల మానవులు సాధించబోయే కథ.

రండి. నాతోపాటు భవిష్యత్తులోకి ప్రయాణించండి... భూమి అంతా దేశాలుగా విభజింపబడి, భూమిమీద వారికి సంబంధించిన ఆకాశంమీద ఎల్లలు ఏర్పరచుకుని వాటి రక్షణకోసం ఆటంబాంబులను, న్యూక్లియర్ బాంబులను తయారుచేసుకుంటున్న దేశాలను మనం చూస్తున్నాం.

రకరకాల ప్రయోగాలు చేసి మళ్ళీ ఆ అణ్వాయుధాలను ఎవరు ఎవరిమీద ప్రయోగించవచ్చు అన్న విషయంమీద రకరకాల ఒప్పందాలు కుదుర్చుకుంటూ తంటాలు పడుతున్న ప్రపంచాన్ని ఇప్పుడు మనం చూస్తున్నాం.

దేశాలు ఈ విధంగా ఎల్లలు ఏర్పరచుకుని, భూమి కోసం, నీటికోసం, ఆకాశంలో భాగంకోసం పోట్లాడుకుంటూ, దేశాల పేరుతో మానవజాతిలో ఐకమత్యం లేకుండా ఉండడంవల్ల జాతి వివక్షలు, మత కలహాలు, స్వదేశప్రేమ, ఇతర దేశాలపట్ల ద్వేషం పెరిగి కలహాలకు, యుద్ధాలకు దారితీస్తున్నాయని, మానవజాతి మనుగడకే ముప్పు వస్తోందని గ్రహించి ప్రపంచదేశాలన్నీ కలసి ఒకే గ్లోబల్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నాయి.

ఈ గ్లోబల్ దేశం తరతరాలుగా మనిషి కలలు గన్న సమాజం నెలకొల్పడంలో విజయం సాధించింది. మొదట ఆర్థిక అసమానతలు సమసిపోవడంతో మనుషుల మధ్య తొంభైశాతం అసూయాద్వేషాలు తగ్గిపోయాయి. అన్ని దేశాలు ఒకటైపోవడంతో జాతి ద్వేషం, కులమత ద్వేషాలు కూడా నశించి ప్రశాంతంగా ప్రజాజీవనం

సాగుతోంది. అలా శాంతిగా, సుభిక్షంగా మనుషులంతా ఒక్కమాట, ఒక్క ప్రభుత్వంగా సాగుతున్న ఆ భవిష్యత్ ప్రపంచంలో...

అంతరిక్షయానం అమితంగా అభివృద్ధిచెందింది. ఈనాటి విమానయానంలాగా అంతరిక్షయానం కూడా ప్రభుత్వాల అధీనంలోంచి బయటపడి ప్రైవేటీకరింపబడింది. ఎయిర్‌లైన్స్ కంపెనీల్లాగే స్పేస్ ట్రావెల్ కంపెనీలు వెలిశాయి. విమానయానం మానవుల వ్యాపార, వ్యవహార అవసరం కోసం ఉపయోగపడుతూనే ఉంది.

అంతరిక్షయానం అగ్రరాజ్యాల రాజకీయ అవసరాల నుంచి రకరకాల వ్యాపారాలు, గూఢాచారి వ్యవహారాల వరకు ప్రభుత్వాలకు తప్పని అవసరంగా తయారయింది. విపరీతంగా పెరిగిన అంతరిక్ష ప్రయాణాలు, ప్రయోగాల కారణంగా ఈ రంగాన్ని కూడా ప్రైవేటీకరించక తప్పట్లేదు ప్రభుత్వాలకు. ప్రభుత్వాల అవసరాలను అలా ఉంచితే, సంపద అనూహ్యంగా పెరిగిన ఆ కాలం ప్రజలకిదో వినోద సాధనంగా తయారైంది.

అంటే మనం భవిష్యత్తులో చాలా శతాబ్దాల తరువాత కాలంలోకి తొంగిచూడబోతున్నామన్నమాట. ఎన్ని శతాబ్దాలు అన్నది నేను నిర్ణయించను. ఈ కథ జరిగాక దీని కాలనిర్ణయం పాఠకులే చెయ్యాలి. రచయితకన్నా పాఠకులే తెలివైన వారని నా ప్రగాఢ విశ్వాసం.

ఇరవై, ఇరవైయొక్క శతాబ్దాలలో సంపన్నులు కొత్త కొత్త పద్ధతుల్లో పెళ్ళిళ్ళు చేసుకోవాలని ఉబలాటపడి మబ్బులమీదుగా వెడుతున్న విమానాల్లోను, సముద్రపు లోతులు చూస్తూ సబ్‌మెరీన్లలోను, కొండ అంచులపైనా, పారాచూట్‌లలో ఎగురుతూనూ వివాహాలు చేసుకున్నట్టుగా ఈ కథా కాలానికి అంతరిక్షంలో ఆ మూడు ముళ్ళూ వేసుకోవడం గొప్పయింది.

ఎంత చెట్టుకంత గాలిలాగా బాగా ఉన్నవాడు హనీమూన్ కూడా ఏ కృత్రిమ శాటిలైట్‌మీదో చేసుకుంటే, మరీ అంత లేనివాడు ఓ గంటసేపు అంతరిక్ష కక్ష్యలో ఎగిరి పెళ్ళితంతు అయిందనిపించి తిరిగి భూమిని చేరుతుంటారు. ఇందులో చాలా లాభాలున్నాయని గ్రహించిన కార్పొరేట్ సంస్థలవారు ఈ రంగంలో ప్రవేశించి ఈ వ్యాపారం స్వాధీనం చేసేసుకున్నారు.

ఐతే వినోదం ఒకటే కాదు, అంతరిక్షంలో సైంటిఫిక్ ప్రయోగాలు కూడా ఎంతో లాభదాయకం అన్న సంగతి కార్పొరేట్‌లు మర్చిపోలేదు. పరిశోధన కూడా వాళ్ళ చేతుల్లోనే ఉంచుకున్నారు పెద్ద పెద్ద కంపెనీల వాళ్ళు.

కొంతకాలానికి ఇదంతా ఒక క్రమపద్ధతిలో జరగవలసిన అవసరం ఎంతైనా ఉందని గ్లోబల్ ప్రభుత్వం గ్రహించింది. అందుకోసం అన్ని దేశాలకీ కలిపి 'నాస్క్' అనే ఒక అంతర్జాతీయ సమితి నేర్పరచుకున్నాయి.

ఈ 'నాస్క్' అంతరిక్షంలో జరిగే ప్రయోగాలను, పరిశోధనలను పరిశీలిస్తూ క్రమబద్ధం చేస్తుంటాయి.

కార్పొరేట్ సంస్థలు చేసే ప్రయోగాల వల్ల ప్రజలకు ప్రమాదం రాకుండా చూడడంలాంటి పనులు చేస్తుంటుంది నాస్క్. ఇప్పుడు మనం భారతదేశం అని చెప్పుకుంటున్న ప్రాంతం కేంద్రంగా ప్రపంచమంతా పెత్తనం చేస్తుంటుంది. కొత్త కొత్త పరిశోధనలు, ప్రయోగాలు చేపడుతుంటుంది కూడా. ఈ నాస్క్ నిర్వహించే ఒకానొక అంతరిక్ష ప్రయోగశాలలో...

# 1

"మనం అందరం ఇక్కడెందుకు సమావేశమయ్యామో మీలో చాలామంది ఊహించే ఉంటారని నాకు తెలుసు" అన్నాడు బృహస్పతి ఠీవిగా అందరినీ కలయజూస్తూ.

"గొప్ప సత్యం పలికాడు గురుడు" వ్యంగ్యంగా అనలేదు పరీక్షిత్. చేతిలో ఉన్న అతిచిన్న పామ్‌టాప్‌ని పోలిన పరికరం 'టి-ప్యాడ్' మీద చూపించాడు. ఆ పరికరం పట్టుకున్నవారి స్పర్శనుబట్టి మనోభావాలను గ్రహించి మానిటర్‌మీద వాక్యాలు సృష్టిస్తుంది. చదివి చిరునవ్వు నవ్వాడు అధర్వ్.

బృహస్పతివైపు కన్నార్పకుండా చూస్తూ అతనింకా ఏం చెప్పబోతాడా అన్నట్టు కృత్రిమమైన ఉత్కంఠమొహం నిండా నింపుకొని ఓవరాక్షన్ చేస్తూ టి-ప్యాడ్‌మీద మాటలు ఇరేజ్‌చేసి, ప్రతి పాయింటూ నోట్ చేసేసుకోడానికి రెడీగా ఉన్నట్టు పోజిచ్చాడు పరీక్షిత్.

"మనకి మరో ప్రాజెక్టు గ్లోబల్ గవర్న్‌మెంట్ శాంక్షన్ చేసింది. సరికొత్త ప్రయోగం చేపట్టబోతున్నాం. ఇది అంతరిక్షప్రయోగం" బృహస్పతి మాటలు అక్కడ చేరిన చాలామంది సీనియర్ సైంటిస్టులకి నవ్వు తెప్పించాయి ఆపుకున్నారు. ఆ భవనం దేశంలోకెల్లా ప్రముఖమైన అంతరిక్ష ప్రయోగశాల. ఆ సమావేశంలో ఉన్నవారంతా అదే ప్రయోగశాలలో పనిచేస్తున్న అనుభవజ్ఞులైన శాస్త్రజ్ఞులు. బృహస్పతి ఆ లేబోరేటరీకి డైరెక్టరు, వారు చేసేవన్నీ అంతరిక్ష ప్రయోగాలే. ప్రత్యేకంగా చెప్పేదేముంది?

పరీక్షిత్తు చేతిలో టి-ప్యాడ్ లైట్ వెలిగింది. అధర్వ్ కళ్ళు కదిలించి చూశాడు. సింపుల్‌గా గీసిన గీతలతో ఒక కోతి, దానిచేతిలో కొబ్బరికాయ ఉన్నట్టు బొమ్మ. దానికింద "ఇంక చూస్కో చిందులు తొక్కుతాడూ పట్టలేం" అన్న వాక్యం కనిపించింది. అధర్వ్ గంభీరంగా మొహం పెట్టి 'ఇంక చాల్లే' అన్నట్టు కళ్ళతోనే సంకేతమిచ్చాడు.

ఆ సమావేశంలో నవ్వునణుచుకోవలసిన అవసరం రాని ఒకే ఒక వ్యక్తి మనో. ఆమె అందరిలోకీ జూనియర్ మోస్ట్. మానసిక శాస్త్రంలో పిహెచ్.డి పట్టా పుచ్చుకోగానే ఈ కేంద్రంలో ఆమెకి పదవి లభించింది, అందరూ ఆశ్చర్యపోయేలా. ఆమె ఉద్యోగంలో చేరాక హాజరైన మొదటి సమావేశమిదే. అందుకే బృహస్పతి చెప్తున్న ప్రతి మాటనూ నిజంగా ఎంతో ఉత్కంఠగా వింటున్న వ్యక్తి అక్కడ ఆమె ఒక్కతే. బృహస్పతి పరీక్షిత్ చిత్రిస్తున్నట్టు నిజంగా కోతీ కాదు, కొబ్బరికాయలాగా అతను ల్యాబ్ వ్యవహారాలతో ఆడుకుందామని చూడనూ చూడడు.

ఐతే, అతనికి వాగ్ధాటిలేదు. మాట కొంచెం తడుముకుంటాడు. అందువల్ల అవసరంలేని మాటలు మాట్లాడుతూ తాత్సారం చేస్తేగానీ అసలు విషయానికి రాలేడు. పరీక్షిత్ లాంటి కొంటెవాళ్ళకి లోకువయ్యేది ఈ విషయంలోనే. పరీక్షిత్తు కొంటెవాడేగాని బాధ్యత తెలిసినవాడు. అధర్వ్ ఇద్దరిలోనూ మేధావి. పరీక్షిత్తుచేసే హాస్యం ఎంజాయ్ చేస్తాడు గానీ ఏదెంతవరకో హద్దులు తెల్సినవాడతను.

కొద్దిగా మంచినీళ్ళు తాగి గొంతు తడుపుకుని బృహస్పతి తన ఉపన్యాసం కొనసాగించాడు అందరూ శ్రద్ధగా వింటున్నారు. "మీకందరికీ తెలుసు. మన కేంద్రం అంతరిక్షంలో ఇప్పటివరకూ చేసిన ప్రయోగాలు ప్రపంచంలో ఏ ఇతర ఆధునిక ప్రయోగశాలకూ తీసిపోవని. నాకు తెలుసు మీరంతా అంతర్జాతీయ ప్రఖ్యాతి గాంచిన శాస్త్రజ్ఞులని. అందుకే ఈసారి అంతరిక్షంలోకి పంపబోయే టీము ఎన్నిక నాకు చాలా కష్టమైంది. ఇంతకీ మనం చెయ్యబోయే ప్రయోగం ఏమిటని మీరు కుతూహలంగా చూస్తున్నారని నాకు తెలుసు" కొంచెం ఆగి, "టైమ్ మెషీన్!" అన్నాడు బృహస్పతి. శ్రోతలు కొద్దిగా ఆశ్చర్యపోయారు. సినిమాలు, సైన్స్ ఫిక్షన్ నవలలనించి ప్రేరణ పొందుతున్నాడా ఈయన? అనుకున్నారు.

"నో. సినిమాల్లో చూపించేరకం ప్రయోగం కాదు" అన్నాడు బృహస్పతి వాళ్ళ అనుమానం తెలుసుకున్నట్టు. "మీకందరికీ తెలుసు బిగ్ బ్యాంగ్ జరిగిన ఎన్నో బిలియన్ల సంవత్సరాలు- ప్రాచీన భారతదేశ విధానంలో చెప్పాలంటే ఎన్నో యుగాలు గడిచిపోయాయని. అది భూతకాలం. ఇప్పుడు మనం చూస్తున్న ప్రపంచం వర్తమానం. గడిచిన నాలుగు శతాబ్దాల గతంలో వాతావరణ కాలుష్యం. గ్లోబల్ వార్మింగ్,

మనుష్యజాతిని నామరూపాలు లేకుండా చెయ్యగలిగే ప్రాణాంతక రోగాలు, సంస్కృతి సంస్కారాల కాలుష్యం ఇంకా ఇంకా ఎన్నెన్నో మనిషి మనుగడకే ముప్పు తెచ్చే చెయ్యకూడని పనులెన్నో మనిషి చేశాడు. తర్వాత రెండు శతాబ్దాలపాటు మానవులు శ్రమించి తిరిగి కాలుష్యరహితమైన ఆరోగ్యప్రదమైన పర్యావరణం తిరిగి సృష్టించుకోగలిగారు... ఇలాంటి వర్తమానంలో ఇకముందు మన భూగ్రహం భవిష్యత్తేమిటన్న ప్రశ్న శాస్త్రజ్ఞుల్లో కుతూహలం రేపుతోంది. ఒకప్పుడు భూగోళ పరిస్థితుల్లో ఏం జరిగిందో తెలియదు. డైనోసార్లు భూమ్మీంచి మాయమయ్యాయి. ఇప్పుడు మనం జాగ్రత్తగా కాపాడుకుంటున్న మన భూగ్రహం పరిస్థితి భవిష్యత్తులో ఎలా ఉంటుంది? మళ్ళీ మరేదైనా ప్రకృతిసిద్ధమైన ప్రళయమో మానవుడి నిర్లక్ష్యమో మన భూగోళాన్ని పతనానికి దారితీయిస్తుందా? అన్న ప్రశ్న శాస్త్రజ్ఞుల్లో కుతూహలం రేకెత్తిస్తోంది. మనం చెయ్యబోయే ప్రయోగం ఈ ప్రశ్నకి సమాధానం వెతకడానికై చేసే తొలి ప్రయత్నం" మళ్ళీ మంచినీళ్ళ గ్లాసందుకున్నాడు బృహస్పతి. శ్రోతల్లో కొందరికి ఆసక్తి కొద్దిగా తగ్గింది. 'ఇదేదో చాలా ఏబ్‌స్ట్రాక్ట్‌గా, అధి వాస్తవికమైన సిద్ధాంతచర్చలు జరిగి ఇదమిత్థమైన ప్రణాళికలేకుండా సాగే ప్రాజెక్టు అయ్యుంటుంది' అనిపించింది వాళ్ళకి. చాలాకాలం సిద్ధాంతపరమైన పరిశోధన జరిపి తర్కించి చివరికి కలికంలోకి లేకుండాపోయే రకరకాల ప్రయోగాల్లో ఇదో రకం అనుకున్నారు.

బృహస్పతి గొంతు సవరించుకున్నాడు. "బిగ్‌బ్యాంగ్ (బ్రహ్మావిస్ఫోటం) జరిగి యుగాలు గడిచినా ఆనాటి విస్ఫోటన ఫలితాలుగా వెలువడ్డ శకలాలు ఇప్పటికీ విశ్వాంతరాళాలలో ప్రయాణిస్తూనే ఉన్నాయన్న సంగతి జగమెరిగిన సత్యం. ఆ శకలాలు గతానికి సంబంధించినవి. మన ప్రయోగంలో మనం ఏం చేస్తామంటే, అటువంటి శకలాలలో ఏదైతే భూమిదిశగా పయనిస్తోందో దాన్ని ఎన్నుకోవాలి. లేదా ఒకదాన్ని ఎంచుకుని దాని దిశను మనకు అనువుగా మార్చుకుంటాం. అంటే అది భూమికి దగ్గరగా వచ్చేలా మారుస్తాం. అది పయనిస్తున్న వేగాన్ని మరింత పెంచితే... కాంతి వేగానికి మించిన వేగానికి పెంచితే బహుశా భూమికి చేరువగా తీసుకురాగలుగుతాం... ఆ శకలం మీదకి ఒక అంతరిక్షనౌకతో మన టీముని దింపుతాం. అంటే అరవై ఐదు మిలియను సంవత్సరాల గతంలోకి వాళ్ళు ప్రవేశిస్తారు. అప్పుడు డైనోసార్లు భూమ్మీద ఇంకా సంచరిస్తున్న కాలమది".

మనో 'నేను వింటున్నది నిజమా లేక కల కంటున్నానా?' అనుకుంది. అంతరిక్ష శాస్త్రం ఎంతో విస్తరించింది. అయితే కొన్ని తరాలకిందట కొద్దిగా శాస్త్రవిజ్ఞానం, అపారమైన కాల్పనికశక్తి ఉన్న రచయితలు, చిత్రపరిశ్రమలోని వ్యక్తులు గతంలోకి

ప్రయాణించడం అనే అంశంమీద ఊహాగానాలు చేసి అద్భుతమైన కాల్పనిక సాహిత్యం, చలనచిత్రాలు సృష్టించారు. ప్రతి యాభై అరవై ఏళ్ళకొకసారి ఆ సబ్జెక్ట్ మీద ఎలక్ట్రానిక్ మీడియాలోనో, సినిమా రంగంలోనో ఏదో ఒక చలనచిత్రం రావడం జరుగుతూనే వుంది. అది ఆ కాలం వారిని అలరించడం జరుగుతూనే వుంది. ఒక తరంలో వచ్చిన కళాసృజన మరో తరంవారిని కూడా అలరించడం జరుగుతూనే వుంది. వాటిని 'ఇ-బుక్స్'గా చదివి, చిత్రాలు చూసి ఎంజాయ్ చేస్తూనే ఉన్నారు. వాటిలో చాలామటుకు వసివాడని క్లాసిక్స్‌గా కళాజగత్తులో, చరిత్రలో నిలిచిపోయాయి. అయితే ఇప్పుడు తను వింటున్నది కల్పన కాదు. అంతరిక్షయానంలో ఇన్నాళ్ళు సాధించిన ప్రగతికి ప్రతీకగా కనిపిస్తున్న పచ్చి నిజం. బృహస్పతి ఇంకా ఏం చెప్తాడా అని ఆసక్తిగా చూసింది మనో.

"ఒక్కక్షణం ఆగండి ప్రొఫెసర్ బృహస్పతీ! ముందుగా మీరు చెప్తున్నది నా పరిధిలో నాకు అర్థమైనంతవరకు నేను మళ్ళీ చెబుతాను చెప్పనిస్తారా?" అన్న మాటలు వినబడి మనో అటు చూసింది. ఆ మాటలు అన్నది ప్రొఫెసర్ వ్యాస్. ఆయన ఈ ప్రయోగశాలకు సంబంధించిన శాస్త్రజ్ఞుడేగానీ ఆయన సబ్జెక్టు జీవశాస్త్రం.

అంతరిక్షంలో జీవకణాల పెరుగుదల, ఇతర గ్రహాల్లో జీవం ఉన్న ఋజువులు మొదలైన విషయాలలో అంతరిక్షయానం చేసి మరీ పరిశోధన జరిపి అద్భుత ఫలితాలు సాధించి తలపండిన ఉద్దండుడాయన. ఆ అంతరిక్ష ప్రయోగశాలలో వున్న కురువృద్ధులు కొద్దిమందిలో ఆయన ప్రముఖుడు. భౌతికశాస్త్రాల్లో ఆయనకు ప్రవేశం ఉంది గానీ ఉద్దండుడు కాడు. ఆయన సందేహమేమిటా అని ఆయన మాటలు శ్రద్ధగా వింది మనో.

"బిగ్ బ్యాంగ్ నాటి విస్ఫోటనలో మిగిలిన శకలాలు అంటే కొన్ని యుగాల కిందటివి అవి. మీరే అన్నట్టు అరవై ఐదు మిలియన్ ఏళ్ళ క్రితపు కాలంలో ఉన్నవని... వాటి మీదకు మన సైంటిస్టు టీములు చేరితే అరవై ఐదు మిలియన్ల ఏళ్ళ గతంలోకి ప్రవేశిస్తారు. అవునా?"

"అవును" చిరునవ్వుతో తలూపాడు బృహస్పతి.

"అంటే భూమ్మీద మనం వర్తమానంలో ఉండగానే మన సైంటిస్టులు కొన్ని యుగాల కిందటి గతంలో ఉంటారు. అవునా?"

"రైట్".

"అంటే గతమూ, వర్తమానమూ ఒకే కాలంలో జరుగుతున్నట్టు కదా?"

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=2418**

* * *